# 25 వ అధ్యాయము

# దేవుని క్రమశిక్షణ

> మీరు అలసట పడకయు మీ ప్రాణములు విసుకకయు యుండునట్లు పాపాత్ములు తనకు వ్యతిరేకముగా చేసిన తిరస్కారమంతయు ఓర్చుకొనిన ఆయనను తలంచుకొనిడి. మీరు పాపముతో పోరాడుటలో రక్తము కారునంతగా ఇంకా దానిని ఎదిరింపలేదు మరియు "నా కుమారుడా ప్రభువు చేయు శిక్షను తృణీకరించకము. ఆయన నిన్ను గద్దించునపుడు విసుకకుము ప్రభువు తాను ప్రేమించిన వారిని శిక్షించి తను స్వీకరించు ప్రతి కుమారుని దండించును అని కుమారులతో సంభాషించునట్లు మీతో సంభాషించు ఆయన హెచ్చరికను మరిచితిరి. శిక్షా ఫలము పొందుటకై మీరు సహించుచున్నారు. దేవుడు కుమారులునుగా మిమ్మును చూచుచున్నాడు. తండ్రి శిక్షింపని కుమారుడెవడు? కుమాళ్ళయిన వారందరు శిక్షలో పాలు పొందుచున్నారు. మీరు పొందని యెడల దుర్బీజులే గాని కుమారులు కారు మరియు శరీర సంబంధులైన తండ్రులు మనకు శిక్షకులై యుండిరి. వారి యందు భయ భక్తులు కలిగి యుంటిమి, అట్లయితే ఆత్మలకు తండ్రియైన వానికి మరి యెక్కువగా లోబడి బ్రదుకవలెను గదా? వారు కొన్ని దినముల మట్టుకు తమ కిష్టము వచ్చునట్టు మనలను శిక్షించిరి గాని మనము తన పరిశుద్ధతలో పాలు పొందవలెనని మన మేలుకొరకే ఆయన శిక్షించుచున్నాడు. మరియు ప్రస్తుతమందు సమస్త శిక్షయు దుఖఃకరముగా కనబడునే గాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగిన వారికి అది నీతియును సమాధానకరమైన ఫలమిచ్చును. కాబట్టి వడిలిన చేతులను సడలిన మోకాళ్ళను బలపరచుడి. మరియు కుంటికాలు బెణకక బాగుపడు నిమిత్తము మీ పాదములకు మార్గములను సరళము చేసుకొనుడి. (హెబ్రీ 12:3-13).

హెబ్రీయ పత్రిక గ్రంథకర్త ప్రకారము మన పరలోకపు తండ్రి ఆయన పిల్లలను క్రమశిక్షణ చేయుచుండునని గ్రహించుచున్నాము. మనము ఒకవేళ ఆయన వలన క్రమశిక్షణ చేయబడని యెడల ఆయన బిడ్డలము కానేరమని తెలియుచున్నది. అందువలన ఆయన క్రమశిక్షణము గూర్చి మనము స్పష్టముగా తెలుసుకొని ఉండుట లేక అవగాహన కలిగి యుండుట మిక్కిలి అవసరము. క్రైస్తవుడుగా పేరుకు మాత్రం నడుచుకొనె వారు మనకు మంచి మేలు

జరిగిన యెడల అదంతయు దేవుని ఆశీర్వాదము దీవెనలు అనియు మనకు వ్యతిరేకముగా జరుగు వన్నియు మన నష్టములు, కష్టములు, సమస్యలు, బాధలు మొదలగునవి దేవుని ఉద్దేశ్యమునకు ఏ మాత్రము సంబంధము లేకుండి కేవలము సాతాను వలన కలుగుచున్నవని భావించుచుందురు. క్రమశిక్షణ ద్వారా దేవుడు మనకు పశ్చాత్తాపము పుట్టించు ఉద్దేశ్యముతో మనకు కలుగు కష్ట నష్టములు దేవుని ఉద్దేశ్య ప్రకారము జరుగుచుండుట లేదని తలంచు కొనుట తప్పు.

భూలోక సంబంధమైన తల్లిదండ్రులు తమ బిడ్డలను క్రమశిక్షణలో ఉంచుట వలన వారు పెద్దవారైన తరువాత తమ సొంత బిడ్డలను కూడా అలాగుననే మంచి క్రమశిక్షణలో వారిని పెంచుదురని నిరీక్షణ కలిగియుందురు. అయన సేవలో మనము ప్రయోజనకరమైన పాత్రలుగా ఉపయోగపడవలెననియు, ఆయన తీర్పు సింహాసనము ఎదుట యోగ్యమైన వారుగా నిలువబడుటకు సిద్ధపడుటకును ఆయన మనలను క్రమశిక్షణ క్రింద ఉంచును. ఆయన పరిశుద్ధతలో మనము పాలు పొందవలెనని దేవుడు కోరుచూ మనయందున్న ప్రేమచేత ఆయన మనలను క్రమశిక్షణలో ఉంచును. ఆత్మీయముగా మనము దేవుని యందు ఎదుగుటయే ప్రేమగల మన పరలోకపు తండ్రి యొక్క కోరిక. "మీలో ఈ సత్క్రియను ఆరంభించిన వాడు యేసుక్రీస్తు దినము వరకు దానిని కొనసాగించునని రూఢీగా నమ్ముచున్నాను" (ఫిలిప్పీ 1:6) అని లేఖనము చెప్పుచున్నది.

తమ తల్లిదండ్రులు తన్ను శిక్షించుట ఏ బిడ్డకైనను ఆనందకరముగా ఉండదు. అలాగుననే దేవుడు మనలను శిక్షించునప్పుడు ఆ అనుభవము దుఃఖకరముగా ఉండునే గాని సంతోషకరముగా ఉండదు. అయితే చివరకు అది నీతియను సమాధానకరమైన ఫలముగా ఆ క్రమశిక్షణ ప్రయోజన కరమగును.

## దేవుడు మనలను ఏ విధముగా, ఎప్పుడు క్రమశిక్షణలో నుంచును?

అవిధేయులైన తమ పిల్లలను ఏ మంచి తండ్రియైనను క్రమశిక్షణలో పెట్టునో అలాగుననే మన పరమ తండ్రియైన దేవుడు కూడా తన బిడ్డలను క్రమశిక్షణలో నుంచును. మనమెప్పుడు అవిధేయులుగా నుందుమో అప్పుడు మనము దేవుని క్రమశిక్షణలో నుంచబడుదుము. దయగల మన ప్రభువు ఎంతో కనికరమయుడు అయినను పశ్చాత్తాప పడుటకు ఆయన ఎక్కువ అవకాశము మనకిచ్చును. మనము పలుమారులు అవిధేయత చూపుచుండు కొలది ఆయన కూడా ఎన్నో విధములైన ముందు జాగ్రత్త హెచ్చరికలను మనకు తెలియపరచి అప్పుడు మాత్రమే దేవుడు మనలను క్రమశిక్షణ క్రిందికి తీసుకొనివచ్చును.

దేవుడు ఏలాగు క్రమశిక్షణ చేయును? ఇంతకు ముందు అధ్యాయములో మనము చూచునట్లు దేవుని క్రమశిక్షణయు ఏదో విధమైన బలహీనతగా గాని వ్యాధి బాధగా గాని అకస్మిక దుర్మరణము రూపములో గాని సంభవించును.

ఇందువలననే మీలో అనేకులు బలహీనులును, రోగులునై యున్నారు.
చాలా మంది నిద్రించుచున్నారు. అయితే మనలను మనమే

విమర్శించుకొనిన యెడల తీర్పు పొందక పోదుము. మనము తీర్పు పొందిన యెడల లోకముతో పాటు మనకు శిక్షావిధి కలుగకుండునట్లు ప్రభువు చేత శిక్షింపబడుచున్నాము (1 కొరింథీ 11:30-32).

దేవుడు మనలను వ్యాధి రోగము కలుగునప్పుడు (యోబును దృష్టిలో పెట్టుకొని) ఆయన వలన శిక్షించబడు చున్నామని వెంటనే తలంచుకూడదు. వ్యాధి, బాధ మనకు కలిగిన యెడల ఆత్మ సంబంధముగా మనలను మనమే పరిశీలన చేసుకొనిన యెడల బాగుండును. ఒకవేళ మన అవిధేయతను బట్టి మనము దేవుని క్రమశిక్షణకు ద్వారము తెరచితిమోనని గమనించవలెను.

మనలను మనము విమర్శించుకొనిన యెడల దేవుని తీర్పును తప్పించుకొన వచ్చును. అనగా మన పాప స్థితిని గ్రహించి పశ్చాత్తాప పడుట మన వ్యాధి, మన రోగము దైవ క్రమశిక్షణ యొక్క ప్రతిఫలమని గ్రహించి పశ్చాత్తాప పడిన యెడల మనము స్వస్థపరచబడుటకు మనము పాత్రులమని గ్రహించుటకు అవకాశము కలదు.

దేవుడు మనలను శిక్షించిన యెడల, పౌలు చెప్పినట్లుగా ఈ లోకముతో పాటు మనము శిక్షావిధి క్రింద ఉండనేరము. అలాగు చెప్పుటలో పౌలు భావమేమనగా దేవుని క్రమశిక్షణ వలన మనము పశ్చాత్తాప పడి ఈ లోకముతో పాటు నరకము లోనికి పంపబడకుండా ఉందుము. పరలోకమునకు వెళ్ళుటకు పరిశుద్ధతయే తగిన మార్గమని అంగీకరించుట కొంచెము కష్టతరమైన విషయమే. ప్రభువైన యేసు యొక్క పర్వత ప్రసంగము చదివిన వారు దేవుని చిత్తమునకు లోబడిన వారు మాత్రమే ఆయన రాజ్యములో ప్రవేశము కలిగియుందురు (మత్తయి 7:21చూడుము). పశ్చాతాప పడక ఇంకను పాపములోనే నిలిచియుంటే నిత్య జీవమును మనము పోగొట్టుకొనే ప్రమాదం వుంది. దేవుని క్రమశిక్షణకై ఆయనకు స్తోత్రములు మనము పశ్చాత్తాపము పడుట వలన నరకములో పడద్రోయ బడకుండ ఆయన మనలను రక్షించుచున్నాడు.

## దేవుని తీర్పు అమలు చేయుటకు సాధనమైన సాతాను

మనుష్యులను క్రమశిక్షణలో ఉంచుటకు దేవుడు సాతానును ఉపయోగించుకొనును అను లేఖన భాగములు దైవ గ్రంథములో కలవు. యేసు ప్రభువు చెప్పిన ఉపమానములో (మత్తయి 18) అప్పు చెల్లించని సేవకుని విషయమై యజమానుడు "కోపోద్రేకుడైనాడు" అతడు తమ యజమానునికి అచ్చియున్నది క్షమింపబడినప్పుడు అతడు తనకు అచ్చి ఉన్న వేరొకనిని క్షమించక అతనిని చెరసాలలో ఉంచెను. గనుక తన అప్పు చెల్లించని వాని విషయమై అప్పంతయు క్షమించబడిన ఆ మొదటి దాసుడు చేసిన దానిని బట్టి ఇతనిని అతడు అచ్చియున్నందంతయు చెల్లించు వరకు బాధపెట్టు వారికి యజమానుడు అప్పగించెనని వ్రాయబడి ఉన్నది (మత్తయి 18:34) నా పరలోకపు తండ్రియు తన సహోదరులైన ప్రతివానిని క్షమించని యెడల అలాగుననే చేయుదనెడి మాటలతో ప్రభువు తన ఉపమానమును ముగించెను.

మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపని

యెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీయెడల చేయుననెను (మత్తయి 18:35).

ఈ "బాధించువారు" ఎవరు? సాతాను వాని అనుచరులై దురాత్మలు ఈ బాధించువారు కావచ్చును. ఒకరిని పశ్చాత్తాపములోనికి తీసుకొని వచ్చుటకు అవిధేయులైన తన పిల్లలను దేవుడు సాతాను చేతులకు వానిని అప్పగించ వచ్చును. అతడు ఇంకను పశ్చాత్తాప పడక పోయిన యెడల అతనిని నిత్యశిక్షకు అప్పగించి వదిలి వేయును. కఠినమైన జీవిత పరిస్థితులు శ్రమలు కష్టములు ఇబ్బందులు, వేదనలు, శోధనలు బాధలు వారిని పశ్చాత్తాపమునకు నడిపించు మార్గమై యున్నది. తప్పిపోయిన కుమారుడు ఈ విధముగానే కనపడెను (లూకా 15:14-19 చూడుము).

దేవుని ఉగ్రతను భరించుటకు పాత నిబంధనలో ఎన్నో సందర్భములలో దేవుడు సాతానును వాని అనుచరులైన దురాత్మలను దేవుని శిక్షలోనికిని, తీర్పులోనికిని అనేక మందిని అప్పగించినట్లు మనము చూడగలము. ఒక ఉదాహరణ న్యాయాధిపతులు 9 వ అధ్యాయములో "అబీమెలకుకును, షెకెము వారికిని మధ్య వైరము పెట్టుటకు దేవుడొక దురాత్మను పంపెను" అని మనము చదువుచున్నాము (న్యాయాధి 9:23) గిద్యోను కుమారులకు వ్యతిరేకముగా దుర్మార్గ క్రియలు చేయుట వలన వారు పైకి తీర్పును రప్పించుటకు ఈలాగు చేయబడెను.

పశ్చాత్తాపములోనికి నడిపించుటకు రాజైన సౌలును బాధించుటకు "యెహోవా వద్ద నుండి ఒక దురాత్మ వెళ్ళెను" అని బైబిలు నందు చదువుచున్నాము. (1 సమూ 16:14). సౌలు ఎంత మాత్రమును పశ్చాత్తాపపడక పోయెను. దేవుని యెడల అతడు తిరుగుబాటు కనబరచినందున యుద్ధములో చనిపోయెను.

పా॥ని॥ లోని ఈ రెండు దృష్టాంతములో "దేవుని వద్దనుండి దురాత్మలు పంపబడినవని" లేఖనముల యందు చదువుచున్నాము. అనగా దేవుని సేవ చేయుటకు దురాత్మలు పరలోకములో ఆయన వద్ద ఉన్నవని అర్థము కాదు. పాపాత్ములైన వారు పశ్చాత్తాప పడి ఈ బాధలు కష్ట నష్టముల నుండి దేవుని వైపు తిరుగుదురేమోనని సాతానును వాని అనుచర దుష్టాత్మలను కొన్ని పరిమితులలో కీడు చేయుటకు వానికి అనుమతి ఇచ్చుచున్నారు.

## దేవుడు క్రమశిక్షణలో ఉంచు ఇతర పద్ధతులు

పాత నిబంధనలో పలుమార్లు దేవుడు తన ప్రజలను క్రమశిక్షణలో ఉంచునట్లు వారికి తరచుగా కరవులు మరియు ఇతర జనాంగముల నుండి శత్రువులు వారిపై అధికారము చేయునట్లు అనుమతించెడి వాడు. దేవుని ప్రజలు పశ్చాత్తాప పడి దేవుని తట్టు తిరిగినప్పుడు వారి శత్రువుల నుండి తన ప్రజలను రక్షించెడి వాడు. చాలా సంవత్సరములు చెరలో, బానిసత్వములో కఠినమైన సేవ చేయుట మున్నగు హెచ్చరికలను వారు తిరస్కరించి ఇంకను పశ్చాత్తాప పడనందున ఒక పరాయి ప్రభుత్వము తన శక్తి బలములతో దేవుని ప్రజలను తమ

దేశమునకు బానిసలుగా తీసుకొని పోయి వారికి సేవ చేయుచు అన్య ప్రదేశములలో వారు స్వాతంత్ర్యము లేని వారుగా జీవించుటకు దేవుడు వారిని అప్పగించెను.

నూతన నిబంధన క్రింద కూడా అవిధేయులైన తమ పిల్లలను దేవుడు వాని జీవితములలో కష్టములు, బాధలు సమస్యలు పొందునట్లు క్రమశిక్షణలో ఉంచును. కొన్ని సార్లు వారి శత్రువులు వారిని బాధించునట్లు కూడా చేయును. ఉదాహరణకు (హెబ్రీ 12:3-13)లో ఉదహరింపబడినట్లు తమ విశ్వాసమును బట్టి హింసింపబడుచున్న హెబ్రీయ విశ్వాసులు వారి అవిధేయతను బట్టి అలాగు శిక్షింపబడిరని మనము గ్రహింపగలము. మరియు ప్రతి సంఘటన వేరువేరుగా తీర్పు తీర్చబడును.

## దేవుని క్రమశిక్షణకు సరియైన విధముగా ప్రతిస్పందించుట

ఈ అధ్యాయము మొదట నే ప్రస్తావించునట్లు ఒకటి రెండు విధములుగా మనము దేవుని క్రమశిక్షణను తప్పు విధముగా భావించ వచ్చును. "దేవుడు చేయు శిక్షను మనము తృణీకరించుట" ద్వారా గాని లేక "దేవుని క్రమశిక్షణ వలన సొమ్మసిల్లి పోవుట" గాని చేయసాగుదుము హెబ్రీ 12:5 దేవుని క్రమశిక్షణ "తృణీకరించుట" వలన ఆయన చేయు హెచ్చరికను విస్మరించి అసలు గుర్తింపకనే యుండుట వలన మనము ఆయన శిక్షను తృణీకరింతుము. ఆయన క్రమశిక్షణ మరింత దుర్భరముగాను, కఠిన తరముగాను ఉండుట వలన మనము విధేయతతో దేవుని సంతోషపెట్టుటకు ప్రయత్నించుటకు బదులు సొమ్మసిల్లి పోవునట్లుగా ప్రవర్తించుదుము. ఈ రెండు విధానములు సరియైనవి కావు. దేవుడు మనలను ప్రేమించు వాడని మనము గుర్తింప వలెను. మన మంచి ప్రయోజనము కొరకే దేవుడు మనలను శిక్షించు వాడని గ్రహించ వలెను. దేవుని క్రమశిక్షణను మనము గుర్తించినప్పుడు ఆయన ప్రేమగలిగిన హస్తమును మనము గమనించ వలెను. మనము పశ్చాత్తాపపడి ఆయన క్షమాపణను అంగీకరించ వలెను.

మనము పశ్చాత్తాప పడినప్పుడు దేవుని క్రమశిక్షణలో మనకు ఊరట లభించును. దేవుని దయ ఆయన సహాయము కొరకు మనము వేడుకొనిన యెడల పాపము యొక్క దుష్ప రిమాణములన్నిటి నుండి మనకు తప్పక ఊరట లభించునని గ్రహించ వలెను. ఎవడు దీనుడై నలిగిన హృదయముగలవాడై నా మాట విని వణకుచుండునో వానినే నేను దృష్టించుచున్నాను (యెషయా 66:2) లో కలదు. దేవుని వాక్యము ఈలాగు చెప్పుచున్నది "ఆయన కోపము నిమిషమాత్రముండును. ఆయన దయ ఆయుష్కాల మంతయు నిలుచును. సాయంకాలమున ఏడ్పువచ్చి, రాత్రి యుండినను ఉదయమున సంతోషము కలుగును." (కీర్తన 30:5).

ఇశ్రాయేలు ప్రజల మీద దేవుడు తన తీర్పును కుమ్మరించునప్పుడు ఆయన ఈ విధముగా వాగ్దాన మిచ్చియున్నాడు.

> క్షణ కాలము నేను నిన్ను ఎడబాసితిని అయితే గొప్ప కనికరముతో నేను నిన్ను సమకూర్చెదను. కోపోద్రేకము చేత క్షణకాలము నా ముఖము నీకు మరుగు చేసుకొంటిని. అయితే శాశ్వతమైన ప్రేమతో

నేను నీయెడల కనికరము చూపెదను (యెషయా 54:7-8).

దేవుడు మంచివాడును, దయా సంపూర్ణుడునై యున్నారు!!

దేవుని క్రమశిక్షణను గూర్చి ఇంకను చదువగోరిన యెడల ఈ క్రింది లేఖన భాగములను చూడుడి.

II. దినవృత్తా 6:24-31, 36-39, 7:13-14, కీర్తన 73:14, 94:12-13, 106:40-46, 118:18, 119:67,71, యిర్మియా 2:29-30, 5:23-25, 14:12, 30:11 హగ్గయి 1:2-13, 2:17, అపో 5:1-11, ప్రకటన 3:19.

